క్లుప్తంగా

డ్యూటీ సర్టిఫికెట్ పేరుతో వేధింపులు తగవు



మాట్లాడుతున్న వీఆర్ఏల సంఘం నేత సత్యరాజు

కోవెలకుంట్ల: డ్యూటీ సర్టిఫికెట్ పేరుతో వీఆర్ఏలను వేధింపులకు గురి చేయడం సమంజసం కాదని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు కోడూరు సత్యరాజు అన్నారు. సోమవారం స్థానిక పాండురంగస్వామి దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..వీఆర్ఏలు సంబంధిత వీఆర్ఓల నుంచి డ్యూటీ సర్టిఫికెట్లు తెస్తేనే వేతనాల బిల్లులు పెడతామని తహసీల్దార్ ఆదేశాలు జారీ చేయడం విడ్డూరమన్నారు.పనిచేయని వీఆర్ఏలను గుర్తించి వారి వేతనాలు నిలుపుదల చేయాలని, డ్యూటీ చేస్తున్న వీఆర్ఏలను డ్యూటీ సర్టిఫికెట్ తేవాలని చెప్పడం విచారకరమన్నారు. ఆయనతో పాటు వీఆర్ఏల సంఘం నాయకులు శివరాముడు, బాషా, గుర్రప్ప, సుబ్బరాయుడు, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా ఏర్పాటు చేశారన్నారు. హెటిరోల్యాబ్, ఆస్ట్రోటెక్ స్టీల్, ఏపీటీయూఎఫ్, హెచ్ఎఫ్‌సీ ఇండియా లిమిటెడ్, సన్ కిషాన్ అగ్రి అండ్ కో కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఎంఎల్‌టీ, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీహెచ్‌సీలో అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: సమాజ సేవను బాధ్యతగా తీసుకుని ఇతరులకు సహాయ పడడం గొప్పవిషయమని వైద్యులు చరణ్‌రాజు, వాణి స్వప్న ప్రియ అన్నారు. సోమవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో రోగులు, గర్భిణులు, వృద్ధులకు యతీశ్ కుమార్ ఆచారి సహకారంతో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధు సూదన్‌రెడ్డి, రాజు అన్నదానం చేశారు. క్లబ్ సభ్యులు వలిబాషా, కేశాలు నాయుడు పాల్గొన్నారు.

ప్రకృతి ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలం



ప్రకృతి సాగు కూరగాయలను కొనుగోలు చేస్తున్న జనం

బేతంచెర్ల: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మంచిదని.. నేల కూడా సారం కోల్పోకుండా ఉంటుందని ఏఓ కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం బేతంచెర్ల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆకు కూరలు, కూరగాయలు, చిరుధాన్యాల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. రైతులు రసాయనాల సాగుకు స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయం చేయాలని.. ఇందుకు ప్రభుత్వం సైతం ప్రోత్సహిస్తుందని మాస్టర్ ట్రైనర్ రమాదేవి తెలిపారు.

పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలి

ప్యాపిలి: పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఎంఈఓ వెంకటేశ్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని బూరుగల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మార్చిలో జరగనున్న పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు సరైన ప్రణాళికతో చదవాలన్నారు. అన్ని సబ్జెక్టులకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. స్పష్టమైన చేతిరాత ద్వారా ఎక్కువ మార్కులు సాధించవచ్చని తెలిపారు. చదివిన ప్రతి అంశాన్ని రాసి చూసుకోవాలని సూచించారు. సందేహం ఉంటే సంబంధిత ఉపాధ్యాయులతో వాటిని నివృత్తి చేసుకోవాలన్నారు.

నాటుసారా స్వాధీనం

అవుకు: మండల పరిధిలోని కొండమనాయునిపల్లె గ్రామ సమీపంలో 60 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన రామపుల్లయ్య సారాను తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. సారా తయారు చేసినా విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇలాంటివి జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వరి రైతు వ్యథ

- పడిపోయిన ధరలు
- గిట్టుబాటు ధరలేక నష్టపోతున్న అన్నదాతలు
- సిండికేట్‌గా మారిన వ్యాపారులు
- ధాన్యం కొనుగోలుపై దృష్టి పెట్టని ప్రభుత్వం

నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు వివరాలు (హెక్టార్లలో..)

మండలం	సాధారణ	సాగు విస్తీర్ణం
బనగానపల్లె	3800	3815
అవుకు	4061	4793
కోవెలకుంట్ల	1395	1527
సంజామల	1119	1372
కొలిమిగుండ్ల	467	340



వ్యాపారుల వద్ద నిల్వ ఉన్న వరి బస్తాలు

బనగానపల్లె: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులను కన్నీరు పెట్టించింది. ఆశాజనకంగా వర్షాలు కురవడం.. గత ఏడాది మంచి ధర ఉండడంతో చాలా మంది రైతులు వరి సాగు చేశారు. ఆర్థికంగా ఎదగవచ్చని భావించారు. అయితే పంట చేతికొచ్చే సమయానికి ధరలు పడిపోవడంతో నష్టపోతున్నారు. దీనికి తోడు వ్యాపారులు సిండికేట్ మారి తక్కువ ధరకే రైతుల నుంచి వరి కొనుగోలు చేశారు. ఆ తర్వాత ధరలు రూ.500 నుంచి 600 వరకు పెరగడంతో వ్యాపారులు జేబులు నింపుకుంటున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం

ఎస్ఆర్‌బీసీ నీటితో పాటు వ్యవసాయ బోర్ల ఆధారంగా ఈ ఏడాది బనగానపల్లె నియోజకవర్గంలో ఎక్కువ విస్తీర్ణంలో వరి పంటను సాగు చేస్తారు. ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 10,842 హెక్టార్లు కాగా ఈ ఏడాది 11,847 హెక్టార్లలో వరి సాగు చేశారు. రైతులు పండించిన వరికి మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం చేతులెత్తేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు రంగంలోకి దిగారు. గత ఏడాది కన్నా సుమారు రూ.వెయ్యి తగ్గించి కొనుగోలు చేయడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడులు కూడా రావని వాపోతున్నారు. గత డిసెంబర్ మొదటి వారం నుంచి రైతులు పండించిన వరి కల్లాలకు చేరింది. గత ఏడాది మాదిరిగా మంచి గిట్టుబాటు ధర ఉంటుందని భావించిన వారి ఆశలు అడియాసలయ్యాయి. కిందటి ఏడాది వరి పంట కల్లాలకు చేరే సరికి 75 కిలోల బస్తా గిట్టుబాటు ధర 2300 నుంచి 2400 ఉండగా ఈ సంవత్సరం రూ.1400 నుంచి 1500లకు పడిపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. గిట్టుబాటు ధర లభిస్తుందన్న ఆశతో ఎక్కువశాతం మంది రైతులు వరిని సుమారు 20 రోజుల వరకు పంట కల్లాలోనే నిల్వ ఉంచారు. ఆ సమయంలోనే వరుస తుపాన్‌లు రావడంతో ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాలు కప్పి ఉంచుకున్నారు. అయితే ధర పెరిగే సూచనలు కనిపించకపోవడంతో గత్యంతరంలేని పరిస్థితుల్లో బస్తా ధాన్యాన్ని రూ.1400- 1500లకే విక్రయించారు. అండగా ఉండాల్సిన ప్రభుత్వం మిన్నకుండిపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని రైతులు పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వం నుంచి కనీసం పెట్టుబడి సాయం కూడా అందలేని.. అప్పులు చేసి సాగు చేస్తే ఇలాంటి పరిస్థితి దాపురించిందని ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది కన్నా పెట్టుబడులు ఎకరానికి రూ.5 నుంచి 6 వేలు ఎక్కువగా వచ్చినట్లు రైతులు వాపోయారు. ఇక కౌలు రైతుల పరిస్థితి వర్ణణాతీతంగా మారింది. కౌలుతో పాటు పెట్టుబడులు పెరగడంతో నిండా మునిగిపోయారు.

అనుహ్యంగా పెరిగిన ధరలు

పంట కల్లాల్లోని ధాన్యం వ్యాపారుల చెంతకు చేరగానే ఈ నెల మొదటి వారం నుంచి బస్తాపై రూ.500 నుంచి రూ. 600 పెరగడంతో వ్యాపారులు లాభపడగా రైతులు నష్టపోయారు. వ్యాపారులే పథకం ప్రకారం రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ధాన్యం మొత్తం తమ వద్దకు చేరగానే ధరలు పెంచినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకుందని గుర్తు చేసుకుంటున్నారు. కౌలు రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. ప్రతి కౌలు రైతుకు కౌలుతో పాటు పెట్టుబడిపోను నష్టం చేతికొచ్చినట్లు వాపోతున్నారు.

పెట్టుబడులు కూడా రాలేదు



వరి సాగు ఈ ఏడాది రైతుల పాలిట శాపంగా మారింది. గత ఏడాది మంచి ధరలు ఉండడంతో ఈ సారి అలానే ఉంటుందని భావించి నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో సంతోషపడ్డాను. అయితే ఆ ఆనందం ఎంతో సమయం నిలవలేదు. ధరలు పడిపోవడంతో బస్తా కేవలం రూ.1500కే విక్రయించాను. పెట్టుబడి కూడా రాలేదు.

–సుబ్బారెడ్డి, రైతు, ఇల్లూరుకొత్తపేట

వ్యాపారులదే రాజ్యం



గత ఏడాది వరి పంటకు మంచి గిట్టుబాటు ధర లభించడంతో ఆదాయం చూశాం. బస్తా రూ.2400 విక్రయించాను. ఈ ఏడాది 5 ఎకరాల్లో వరి సాగు చేశాను. బస్తా నెల వాయిదాపై రూ.1500కే విక్రయించాను. వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతుల వద్ద తక్కువ ధరకే కొనుగోలు చేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది.

–వెంకటేశ్వర్లు, రైతు, కాపులపల్లె

వేడుకగా పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, నైవేద్య సమర్పణ చేసి కర్పూర నీరాజనాలు పలికారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఈఓ చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పట్టుతప్పుతున్న పంచాయతీలు

- మండలంలో 19 పంచాయతీలకు ఆరుగురు కార్యదర్శులే
- మిగిలిన వాటికి ఇన్‌చార్జ్‌లే దిక్కు
- గాడితప్పుతున్న పాలన



బేతంచెర్ల ఎంపీడీఓ కార్యాలయం

బేతంచెర్ల: మండలంలో పంచాయతీ కార్యదర్శుల కొరత వేధిస్తోంది. మొత్తం 19 గ్రామ పంచాయతీలు ఉండగా 6 మంది మాత్రమే ఉన్నారు. 6 గ్రామ పంచాయతీల కార్యదర్శులే మిగతా గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆయా గ్రామ పంచాయతీల్లో పాలన పట్టుతప్పుతోంది. మండల పరిధిలోని సిమెంట్ నగర్, ఆర్ఎస్ రంగాపురం, అంబాపురం, ఆర్ బుక్కాపురం, గోరుమానుకొండ, యంబాయి గ్రామ పంచాయతీలకు రెగ్యులర్ కార్యదర్శులు ఉన్నారు. పంచాయతీల్లో గ్రామ సభలు, ముఖ్యమైనా సమావేశాలు, పారిశుద్ధ్యం, తాగునీటి ట్యాంకుల శుభ్రత, జనన, మరణ సర్టిఫికెట్ల జారీ వీరే చూసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఉదయం 6 గంటలకు బయలుదేరి గ్రామాల్లో గ్రామసభ నిర్వహించి, పక్క గ్రామ పంచాయతీకి వెళ్లి అక్కడ సమావేశం, అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ పంచాయతీ కార్యదర్శులకు తలకు మించిన భారంగా మారింది. దీనికితోడు మండల స్థాయిలో శిక్షణ, సమావేశాలు ఉంటే ఆయా గ్రామల్లో ప్రజలకు పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటారో లేదో అర్థం కాని పరిస్థితి నెలకొంది. పంచాయతీ కార్యదర్శులకు పనిభారం ఎక్కువ కావడమో మరే కారణం చేతనో 4 గ్రామ పంచాయతీలకు సచివాలయ పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికైనా ఆయా పంచాయతీలకు ఇన్‌చార్జ్‌లు కాకుండా రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులను నియమించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నేడు వ్యాపారులతో సమావేశం

బేతంచెర్ల: పట్టణంలోని కిరాణ, చికెన్ దుకాణాల్లో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, గ్లాసులు, బాటిళ్ల విక్రయాలు నిలుపుదల చేసేందుకు మంగళవారం వ్యాపారులతో సమావేశం నిర్వహించనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయంలో సాయంత్రం 3:30 గంటలకు జరిగే సమావేశానికి వ్యాపారులు తప్పక హాజరుకావాలని సూచించారు. ప్రజలు ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగానికి స్వస్తి పలకాలని కోరారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు

బనగానపల్లె రూరల్: నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కైప గ్రామానికి చెందిన మధుసుధాకర్ రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య సోమవారం తెలిపారు. బాధితుడు ఈ నెల 16వ తేదీ సొంత పని నిమిత్తం ఆటోలో బనగానపల్లెకు ప్రయాణిస్తుండగా బనగానపల్లె నుంచి వస్తున్న ట్రాక్టర్ అతివేగంగా కై ప గ్రామంలో ఆటోను ఢీకొందని చెప్పారు. అందులో ప్రయాణిస్తున్న మధుసుధాకర్‌తో పాటు ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయని వెల్లడించారు. బాధితుడి తమ్ముడు ఉప్పరి మధు ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ పఠాన్ మస్తాన్‌వలిఖాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నిరసన

బేతంచెర్ల: ఆర్ఎస్ రంగాపురం వీఓఏ లక్ష్మీదేవి ఆత్మహత్యాయత్నానికి కారకులైన ఏపీఎం, సీసీని తక్షణమే సస్పెండ్ చేయాలని సీఐటీయూ కార్మిక సంఘం నాయకులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఎల్లయ్య, డీవైఎఫ్ఐ నాయకుడు మధుశేఖర్ మాట్లాడారు. మండలంలో ఎలాంటి గ్రామసభలు నిర్వహించకుండా రాజకీయ నాయకుల ప్రలోభంతో 14 మంది వీఓఏలను ఏపీఎం ఏ విధంగా తొలగిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఏపీఎం, సీసీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు



నాయినపల్లెలో తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



కంచె లేకుండా రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

పొంచి ఉన్న ప్రమాదం

కొలిమిగుండ్ల: ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ గోడలు లేకపోవడంతో ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులతో పాటు వాహనదారులు భయ భ్రాంతులకు గురవుతున్నారు. మండల కేంద్రం కొలిమిగుండ్లలో ప్రధాన రహదారులతో పాటు పలు చోట్ల 18 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఒక్కటంటే ఒక్కదానికి రక్షణ కంచెలను విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేయలేదు. చాలా చోట్ల తక్కువ ఎత్తులో చిన్న పిల్లలకు అందే ఎత్తులో ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఒత్తిడి అధికమై మంటలు వ్యాపిస్తుంటాయి. వాహనదారులు ఏమాత్రం అదుపు తప్పితే ట్రాన్స్‌ఫార్మర్లను ఢీకొనే పరిస్థితులు ఉన్నాయి.ప్రమాదాలు జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పశువులకు వైద్య పరీక్షలు

ప్యాపిలి: పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ కిశోర్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని మాధవరం, జలదుర్గం, చిన్నపొదిళ్ల గ్రామాల్లో సోమవారం పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. దాదాపు 400 పశువులకు వైద్య చికిత్సలు నిర్వహించారు. బాహ్య పరాన్న జీవుల నివారణకు పశువులపై స్ప్రే చేశారు. జీవాలకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులు వేయించాలన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు గ్రామాల వారీగా పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశువైద్యాధికారులు పద్మావతి, విద్యాసాగర్ రెడ్డి, హుసేని పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల: పశువులకు సోకే వివిధ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి కృష్ణకుమార్ సూచించారు. బిజనవేములలో పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువులకు గర్భకోశ చికిత్సలు, నట్టల నివారణ మందుల పంపిణీ, వ్యాధి నిరోధక టీకాలు, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి శాస్త్రీయ యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు.

వైద్యుల సూచనలు పాటించాలి

అవుకు: పాడి రైతులు పశువైద్యుల సూచనలు పాటిస్తే పాల దిగుబడిని పెంచుకోవచ్చని అవుకు పశువైద్యురాలు భారతీదేవి అన్నారు. మండల పరిధిలోని సంగపట్నం గ్రామంలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పాడి రైతులు తమ పశువులకు లింగ నిర్ధారిత వీర్యం ద్వారా కేవలం ఆడ దూడలు జన్మించే ఎదసూదులు వాడాలన్నారు. ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి నట్టల నివారణ మందు తాపించారు. రైతులకు క్యాల్షియం పాకెట్లను అందించారు.

వ్యవసాయం పశుపోషణతో అదనపు ఆదాయం

బనగానపల్లె రూరల్: వ్యవసాయంతో పాటు పశుపోషణ ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజశేఖర్ అన్నారు. మండలంలోని పాతపాడు గ్రామంలో బనగానపల్లె పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు మారుతిసకారామ్ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం, లేగ దూడల ప్రదర్శన జరిగింది. వెటర్నరీ పాలిక్లినిక్ ఉపసంచాలకులు డాక్టర్ హేమంత్ పశువులకు ఆరోగ్య పరీక్షలు చేసి పాడిరైతులకు మందులు పంపిణీ చేశారు. దూడలకు నట్టల నివారణ మందులను తాపించారు. సర్పంచ్ మహేశ్వరరెడ్డి, పశువైద్యులు రామ్ కుమార్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రాఘవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

470 పశువులకు వైద్యం

సంజామల: ఆకుమల్ల, నట్లకొత్తురు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో దాదాపు 470 పశువులకు వైద్యం అందించామని పశువైద్యుడు రఘుబాల క్రిష్ణ తెలిపారు. 1800 జీవాలకు నట్టల మందు తాపించామని పేర్కొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కొలిమిగుండ్ల: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశుఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి రమేష్‌బాబు సూచించారు. సోమవారం నందిపాడు, బెలుంలో పశుఆరోగ్య శిబిరాలను ప్రారంభించారు. ఈనెల చివరి వరకు గ్రామాల్లో ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. పశువులకు వైద్య చికిత్సలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స అందిస్తామని చెప్పారు. ఎదకు రాని, చూలు కట్టని, ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి వైద్యం అందిస్తామన్నారు.



ప్యాపిలి: జలదుర్గంలో వైద్య చికిత్స చేస్తున్న ఏడీ



కొలిమిగుండ్ల: నందిపాడులో..



కోవెలకుంట్ల: జీవాలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న సిబ్బంది



బనగానపల్లె: మాట్లాడుతున్న పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ రాజశేఖర్



అవుకు: సంగపట్నంలో..


ముచ్చట్ల మల్లికార్జునస్వామికి పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయంలో పుష్యమాసం సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ చేసి మహా మంగళహారతి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

డైరీల ఆవిష్కరణ



డైరీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: రవి హైబ్రీడ్ సీడ్స్‌కు సంబంధించిన నూతన సంవత్సర డైరీలను రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మారం సుబ్బారెడ్డి, రవి సీడ్స్ సంస్థ రాయలసీమ జోనల్ మేనేజర్ శివ చౌదరి చేతుల మీదుగా ఆవిష్కరించారు. పట్టణంలోని ఎంఎస్ఆర్ కార్యాలయంలో సోమవారం ధర్మారం సుబ్బారెడ్డిని కంపెనీ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. స్ఫూర్తి సంస్థ సభ్యులు ఆలా మధు, కొచ్చెర్వు నారాయణ స్వామి, భాస్కర్ ఉన్నారు.

ముందుగా గుర్తిస్తే కుష్టు నయం



అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు



అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది

బనగానపల్లె రూరల్: కుష్టు వ్యాధిని ముందుగా గుర్తిస్తే నయం చేసుకోవచ్చని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు అన్నారు. సోమవారం పట్టణంలోని సచివాలయం-5 పరిధిలో జరుగుతున్న కుష్టువ్యాధి పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 2వ తేదీ వరకు కుష్టువ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. వైద్య సిబ్బంది ఇళ్ల వద్దకు వచ్చి పరీక్షలు చేస్తారన్నారు. వారికి సహకరించాలన్నారు. పాదల వాపు, కాళ్లకు చెప్పులు జారిపోవడం, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం తదితర లక్షణాలు ఉంటే వైద్య సిబ్బందిని సంప్రదించి మందులను ఉచితంగా పొందవచ్చని తెలిపారు. అనంతరం కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి, సూపర్‌వైజర్ అయ్యమ్మ, రమేష్, గ్రేసమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చూడముచ్చటగా చుట్టేస్తుంది..!



వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగిపోతోంది. ఒకప్పుడు పశువుల మేతగా ఉపయోగించే గడ్డిని కోత కోసి విక్రయించేవాళ్లు. కాలానుగుణంగా మార్పులు చోటు చేసుకోవడంతో వరిగడ్డిని కోత కోసి చుట్టలు చుట్టే యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఇవి క్షణాల్లో వరిగడ్డిని చూడముచ్చటగా చుట్టేస్తాయి. రవాణా చేయడానికి ఎంతో సులభంగా ఉంటుంది. రైతులు సైతం వాటిపైనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం వరి గడ్డి చుట్టలకు డిమాండ్ ఏర్పడింది. పొలాల్లోనే యంత్రం సాయంతో గడ్డిని చుట్టలుగా చుట్టేసి ఒక్కో కట్ట రూ.70 నుంచి రూ.120 వరకు విక్రయిస్తున్నారు. కొందరు నిల్వ ఉంచుకుని పశువులకు దానాగా వాడుకుంటున్నారు.

–కొలిమిగుండ్ల